కాకినాడ ఖ్యాతి ఇంతింతై!

- మూడోసారి జాతీయ క్రీడలకు వేదిక
- వచ్చేనెల 1 నుంచి బాలికల హాకీ పోటీలు
- 29 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు రాక
- సుమారు 20 లక్షల బడ్జెట్‌తో నిర్వహణ


జాతీయ పోటీలకు వేదిక కానున్న కాకినాడ డీఎస్‌ఏ హాకీ మైదానం


కాకినాడ డీఎస్‌ఏలో అసంపూర్తి పనులతో నిలిచిపోయిన డార్మెటరీ భవన నిర్మాణం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా కళలకు, క్రీడలకు ప్రసిద్ధి. ముచ్చటగా మూడోసారి జాతీయస్థాయి బాలికల హాకీ పోటీలకు వేదికై ంది. ఈ క్రీడలకు ఆతిథ్యమిస్తూ మరోసారి తన ఖ్యాతిని పెంచుకోనుంది. హాకీ ఇండియా ఆగస్టు 1 నుంచి 10 వరకు జరిగే జాతీయస్థాయి జూనియర్ బాలికల హాకీ పోటీలను ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించగా రాష్ట్రంలో హాకీ టర్ఫ్ ఉన్న కాకినాడ డీఎస్‌ఏకు ఈ టోర్నమెంట్ కేటాయించారు. ఇప్పటికే టోర్నమెంట్ నిర్వహణపై సంబంధిత అధికారులతో కలెక్టర్ షణ్మోహన్ సమావేశాలు నిర్వహించి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. 2022లో బాలికల విభాగంలో జూనియర్ నేషనల్ కాకినాడ డీఎస్‌ఏలో నిర్వహించారు. 2023లో సీనియర్స్ నేషనల్స్ బాలికల విభాగంలో కాకినాడ వేదికగా జరిగాయి. ఇప్పుడు మూడో సారి జూనియర్ బాలికల జాతీయస్థాయి హాకీ పోటీలు కాకినాడ వాసులకు కనువిందు చేయనున్నాయి. సమారు రూ.20 లక్షల బడ్జెట్‌తో ఈ పోటీలు నిర్వహించనున్నారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు వసతి, భోజన సౌకర్యాలు కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో జరిగే ఈ పోటీలకు 29 రాష్ట్రాల నుంచి 522 మంది క్రీడాకారులు హాజరుకానున్నారు. 58 మంది కోచ్‌లు, మేనేజర్లు, స్థానిక అధికారులతో కలిపి 660 మంది ఈ పోటీలల్లో పాల్గొననున్నారు.

పోటీల నిర్వహణకు హాకీ మైదానాన్ని అనువుగా తీర్చిదిద్దే పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. పోటీల నిర్వహణ నిమిత్తం ఏర్పాటు చేసిన కమిటీకి అధ్యక్షునిగా హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు చాణుక్య రాజ్, నిర్వహణ కార్యదర్శిగా జి.హర్షవర్ధన్, సంయుక్త నిర్వహణ కార్యదర్శిగా జిల్లాకు చెందిన వి.రవిరాజు వ్యవహరిస్తున్నారు. డీఎస్‌ఏ ఆవరణలోని డార్మిటరీ భవన నిర్మాణం పనులు 80 శాతం పూర్తికాగా మిగిలిన ఇరవై శాతం రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షలు ఖర్చు అవుతాయని, ఈ నిధులు ఇటీవల బెవరేజ్ కార్పొరేషన్ అందించిన సీఎస్సార్ నిధుల నుంచి కలెక్టర్ మంజూరు చేసి భవన నిర్మాణం పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని పలువురు క్రీడా సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. ఈ భవనం వినియోగంలోకి వస్తే జాతీయ స్థాయి పోటీలకు హాజరయ్యే వివిధ రాష్ట్రాల క్రీడాకారిణులకు డీఎస్‌ఏ ఆవరణలోనే వసతి ఏర్పాటు చేసే అవకాశం ఉంటుంది. 2022లో నిర్వహించిన పోటీలకు హాకీ ఇండియా రూ.11 లక్షల నిధులు మంజూరు చేయగా, ఈసారి నిర్వహించే పోటీలకు ఆ సంస్థ రూ.20 లక్షలు ఇచ్చే అవకాశం ఉందంటున్నారు.

పోటీలకు ముమ్మర ఏర్పాట్లు



వచ్చే నెల ఒకటి నుంచి పదో తేదీ వరకు నిర్వహించే జాతీయ జూనియర్ హాకీ బాలికల పోటీలకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే హాకీ ఆంధ్రప్రదేశ్ పోటీల నిర్వహణకు కమిటీ ఏర్పాటు చేసింది. జిల్లా కలెక్టర్ షన్మోహన్ సహకారంతో క్రీడాకారులకు వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తున్నాం. మూడోసారి కాకినాడ కేంద్రంగా జరుగుతుండంతో పోటీలు విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

– రవిరాజు, హాకీ సంఘం ప్రతినిధి

దాతలు సహకరించాలి : జేసీ మీనా


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ రాహుల్ మీనా

కాకినాడ సిటీ: ఆగస్టు నెలలో జరగనున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, జాతీయ జూనియర్ ఉమెన్ హాకీ ఛాంపియన్ షిప్ పోటీలకు సంబంధించి జిల్లాలో ఉన్న పరిశ్రమలు సామాజిక బాధ్యత కింద తమ వంతు సహకారాన్ని అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా కోరారు. గురువారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా పరిశ్రమలు, ఫ్యాక్టరీస్, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు శాఖ అధికారులతో కలిసి జిల్లాలోని వివిధ పరిశ్రమల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమాలకు ధన, వస్తు, ఆహార రూపాల్లో జిల్లాలోని పారిశ్రామికవేత్తలు సామాజిక బాధ్యత కింద తమ వంతు సహాయం అందజేయాలని కోరారు. సమావేశంలో సీపీఓ పి.త్రినాథ్, పరిశ్రమల శాఖ జీఎం సీహెచ్ గణపతి, వ్యవసాయశాఖ ఏడీ ఎస్ విజయకుమార్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సంక్షేమానికి ట్రెండ్ సెట్టర్ జగన్

- చంద్రబాబు మాటలు ప్రజలు నమ్మరు
- లోకేష్ ఖాతాలోవన్నీ జగన్ పథకాలే
- జమ్మలమడక నాగమణి



కాకినాడ రూరల్: గత వైఎస్సార్ సీపీ పాలనలోని నవరత్న పథకాలలో ఒకటైన 'అమ్మఒడి'ని 'తల్లికి వందనం'గా మార్చి జగన్ పథకాలను కాపీ కొట్టి లోకేష్ ఆ పథకాన్ని ప్రవేశపెట్టినట్టు చెప్పుకోవడం సిగ్గుచేటని ఆ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి విమర్శించారు. ప్రజలను మోసం చేయడం అలవాటుగా చేసుకున్న చంద్రబాబు మాటలను నమ్మే పరిస్థితిలో రాష్ట్ర ప్రజలు లేరని ఆమె అన్నారు. ప్రపంచంలో ఎవరు ఈ ఘనత సాధించిన అది తన ఖాతాలో వేసుకోవడం చంద్రబాబుకు పరిపాటి అన్నారు. సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ట్రెండ్ సెట్టర్ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని, ఎవరైనా ఆయన పథకాలను కాపీ కొట్టాల్సిందేనని ఆమె అన్నారు. జగన్ పథకాలను టీడీపీ మిత్రపక్షమైన జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ గతంలో మెచ్చుకున్న విషయాన్ని వృద్ధాప్యం వల్ల చంద్రబాబు మర్చిపోయారన్నారు. ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకొని తప్పుడు ప్రచారాలు మానుకుని తన గౌరవాన్ని కాపాడుకోవాలని, ఇతరుల సామర్థ్యాన్ని తన కుమారుడి సామర్థ్యంగా పేర్కొనడం సిగ్గుచేటని, దానిని ప్రజలు ఆమోదించరని ఆమె పేర్కొన్నారు.

ప్రభుత్వ స్థలంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు

- ఆ భూమి తమదని ఓ వర్గం..
- కాదు తమదని.. పత్రాలు ఉన్నాయని మరో వర్గం ఫిర్యాదు


నిరసన వ్యక్తం చేస్తున్న ఏనుగుపల్లి జ్యోతిప్రియ, వానపల్లి పోలీసు తదితరులు

కాకినాడ రూరల్: పూర్వం బర్మా కాందిశీకుల కోసం సర్పవరంలో ప్రభుత్వం అందించిన స్థలంలో బుధవారం రాత్రి అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం చర్చనీయాంశమైంది. ఎకరం భూమిని ఇక్కడ పట్టు పరిశ్రమ కోసం అప్పట్లో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కేటాయించారు. ఈ భూమి అన్యాక్రాంతమవుతోందని, దానిని స్వా. దీనం చేసుకుని ఎస్సీలకు పంచాలని ఆ వర్గం నాయకురాలు ఏనుగుపల్లి జ్యోతిప్రియ డిమాండ్ చేశారు. సర్పవరం గ్రామంలో ఆటోనగర్‌కు అనుకుని ఈ స్థలం తమదేనంటూ కొందరు వ్యక్తులు భవనాలు కూల్చివేత చేపట్టగా కొందరు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు కావడంతో గురువారం ఉదయం శిబిరం ఏర్పాటు చేసి జ్యోతిప్రియ, కనపర్తి పోలీసు, తదితరులు నిరసనకు దిగారు. విషయం తెలుసుకున్న సీఐ పెద్దిరాజు అక్కడకు చేరుకుని వారి నుంచి వివరాలు సేకరించారు. మరో వైపు ఈ స్థలంలో 58 సెంట్లు తమ కుమారుడు వెలగల రాజశేఖరరెడ్డి పేరిట కొనుగోలు చేశామని, పూర్తి హక్కులతో డాక్యుమెంట్లు ఉన్నాయని తమకు న్యాయం చేయాలని కాకినాడకు చెందిన సత్తి రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సర్వే చేసి తమ స్థలం అప్పగించాలని ఇటీవలే జిల్లా కలెక్టరుకు అర్జీ పెట్టుకుని శుభ్రం చేస్తుండగా కావాలని గందర గోళం సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు.

ఘనంగా జాతీయ మత్స్య రైతుల దినోత్సవం


ఆక్వా రైతులను సన్మానిస్తున్న అధికారులు

కాకినాడ రూరల్: ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్(ఐసీఏఆర్) – సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ ఎడ్యుకేషన్ (సీఐఎఫ్ఈ) కాకినాడ కేంద్రంలో జాతీయ మత్స్యరైతుల దినోత్సవం గురువారం జరిగింది. సీఐఎఫ్ఈ ముంబై డైరెక్టరు పి.సాహూ ఆధ్వర్యంలో కాకినాడ కేంద్ర ఇన్‌చార్జి, సీనియర్ సైంటిస్ట్ శ్యామల అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆక్వా రైతులకు పలు సూచనలు తెలియజేసి, సాగులో మెళకువలను వివరించారు. ఎస్ఐఎఫ్‌టీ ప్రిన్సిపల్ ఎస్.అంజలి, నేషనల్ సెంటర్ ఫర్ సస్టైనబుల్ ఆక్వాకల్చర్(నాక్సా) సీఈఓ డయాహన్ ఖంగ్లామ్, డాక్టరు ఆశోక్‌రెడ్డి మట్లాడారు. ఆక్వా రైతులు రాంబాబు, రామచంద్రరావులను సన్మానించారు.

చేప రైతులు మన ఆర్థిక నాయకులు

బాలాజీచెరువు: నేటి కాలంలో చేపల పెంపకం ప్రధాన ఆదాయ వనరుగా మారిందని నన్నయ వర్సిటీ ప్రొఫెసర్ రమణేశ్వరి పేర్కొన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన జాతీయ చేప రైతు దినోత్సవంలో ఆమె మాట్లాడుతూ ఏటా జూలై 10న జాతీయ చేప రైతుల దినోత్సవం నిర్వహిస్తున్నామని, చేపల రైతులు మన ఆర్థిక నాయకులన్నారు. ముందుగా బ్లూ రివల్యూషన్ పితామహుడు డాక్టర్ హీరలాల్ చౌదరి చిత్రపటానికి వారు నివాళులర్పించారు. కళాశాల అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు మాట్లాడుతూ ఆదిత్యలో ఫిషరీస్ కోర్సుకు ప్రాధాన్యమిచ్చి పరిశోధన ల్యాబ్‌లను ఏర్పాటు చేశామన్నారు. కళాశాల డైరెక్టర్ సగుణారెడ్డి మాట్లాడుతూ పరిశోధన, ఉద్యోగ అవకాశాలకు వెనుకడుగు వేయకుండా ప్రత్యేక చొరవతీసుకుంటున్నామని, విద్యార్థులు ఉత్తమ శాస్త్రవేత్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సత్యనారాయణ, ఫిషరీస్ ఇన్‌చార్జ్ నరసింహమూర్తి, స్వాతి, అనిల్, సుభాషిణి పాల్గొన్నారు.

శ్రీసిటీ తరహాలో సెజ్ అభివృద్ధి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్



బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): స్థానిక తీర ప్రాంతంలో మరెన్నో పరిశ్రమలు వస్తాయని అలాగే అక్కడ శ్రీ సిటీ తరహాలో మరింత అభివృద్ధి చేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎస్ మాధవ్ అన్నారు. గురువారం గురుపౌర్ణమి సందర్భంగా ఆయన నగరంలో ఉన్న పలువురిని కలిసేందుకు వచ్చారు. ఈ సందర్భంగా కాకినాడలోని పార్టీ సీనియర్ నేత పైడా భవనప్రసాద్ నివాసంలో విలేకరులతో మాట్లాడారు. తాను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత కాకినాడకు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తన తండ్రికి, తనకు కాకినాడతో ఎంతో అనుబంధం ఉందన్నారు. ఆయనకు బీజేపీ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరావు ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు పైడా కృష్ణమోహన్, వేటుకూరి సూర్యనారాయణరాజు, యార్లగడ్డ రామ్‌కుమార్, కవికొండల భీమశంకర్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కరప: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు కాకినాడలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తాళ్లరేవు మండలం మట్లపాలెం గ్రామానికి చెందిన వనమాడి మహేష్ (24) కాకినాడ పోర్టులో పనిచేస్తుంటాడు. ఈ నెల 8వ తేదీ రాత్రి విధులకు హాజరయ్యేందుకు మహేష్ తన మోటార్‌సైకిల్‌పై ఇంటి నుంచి బయలుదేరాడు. కరప మండలం ఉప్పలంక బ్రిడ్జి దిగుతుండగా అదుపుతప్పి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని కాకినాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. అతని బంధువుల ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ వి.సూరిబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీ ఎన్‌జీఓ సంఘం కరప కార్యవర్గం ఎన్నిక

అధ్యక్షుడిగా బీఆర్‌వీ చౌదరి


కొత్త కార్యవర్గంతో జిల్లా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు

కరప: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఏపీ ఎన్‌జీఓ (ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్, గెజిటెడ్ ఆఫీసర్స్) అసోసియేషన్ పరిధిలోని కరప యూనిట్ కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా బీఆర్‌వీ చౌదరి మూడోసారి ఎన్నికయ్యారు. స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం కరప, కాకినాడ రూరల్ మండలాలు, ఏపీఎస్‌పీ కార్యాలయం, కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసు, పండూరు పీహెచ్‌సీ ప్రాంతాలలోని ఎన్‌జీఓలు సమావేశమై కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఒకో పోస్టుకు ఒకే నామినేషన్ రావడంతో నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారి ఎ.సత్తిరాజు (కాకినాడ పట్టణ అధ్యక్షుడు), అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా మట్టపర్తి వెంకటేశ్వరరావు (కాకినాడ పట్టణ కార్యదర్శి) ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.రామ్మోహనరావు, పేపకాయల వెంకటకృష్ణ, ఉపాధ్యక్షుడు ఎస్.చంద్రరావు, పి.పాండురంగారావు, జిల్లా కార్య నిర్వహణ కార్యదర్శి వై.రామకృష్ణ తదితరులు కరప యూనిట్ కొత్త కార్యవర్గానికి అభినందనలు తెలిపి, సంఘ అభివృద్ధికి, యూనిట్‌లోని ఎన్‌జీఓల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలన్నారు.

సభ్యులు వీరే

ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ కరప యూనిట్ అధ్యక్షుడిగా బీఆర్‌వీ చౌదరి (కరప పీహెచ్‌సీ), అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కె.వెంకటరత్నం (పీఎస్, తిమ్మాపురం) ఉపాధ్యక్షులుగా యు.వినోద్(పండూరు పీహెచ్‌సీ), ఎస్.ఫణిమురళీకృష్ణ (వేళంగి సచివాలయం), కె.నానిబాబు (సబ్ రిజిస్ట్రార్, సర్పవరం), కార్యదర్శిగా కె.కేశవరావు (వాకలపూడి పంచాయతీ) సంయుక్త కార్యదర్శులుగా ఎస్.కిరణ్‌కుమార్ (యండమూరు సచివాలయం), సీహెచ్ మణి కుమార్ (వాకలపూడి-2 సచివాలయం), పి.వీరభద్రరావు (పీఎస్, వేళంగి), మహిళా సంయుక్త కార్యదర్శిగా వి.కామేశ్వరి (వాకలపూడి సచివాలయం), కోశాధికారిగా కె.రాఘవకుమార్ (కరప పీహెచ్‌సీ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

భక్తిశ్రద్ధలతో గురు పౌర్ణమి పూజలు


అశోక్‌నగర్‌లోని సాయిబాబా దర్శనానికి క్యూ కట్టిన భక్తులు


నడకుదురులో సాయి సత్యవ్రతాలు చేస్తున్న భక్తులు


కరపలో ముత్య ప్రసాద్ దంపతులకు గురుసత్కారం

- నగరంలో పలు ఆలయాల్లో అభిషేకాలు, అన్నదానాలు
- వేలాదిగా పోటెత్తిన్న భక్తులు

బోట్‌క్లబ్: నగరంలో గురుపౌర్ణమి వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. శిరిడీ సాయి ఆలయాల్లో ఉదయం పంచామృతాభిషేకాలు చేశారు. స్థానిక పేర్రాజుపేటలోని సాయి బాబా ఆలయంలో సుమారు 500 మందికి అన్నప్రసాదం అందించారు. ఆలయ కమిటీ సభ్యులు రమణ, కె.రాంగోపాల్ పాల్గొన్నారు. స్థానిక రిజర్వ్‌లైన్ అయ్యప్పస్వామి ఆలయంలో ఉన్న సాయిబాబాకు, దత్తాత్రేయ స్వామి వారికి పంచామృతాభిషేకాలు, అర్చన నిర్వహించారు. ప్రత్యేక పల్లకిలో దత్తాత్రేయ స్వామిని, బాబాను గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ ఇన్‌చార్జ్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. స్థానిక అశోక్‌నగర్ షిర్డీ సాయి ఆలయంలో చంద్రాభట్ల నాగేంద్రశర్మ ఆధ్వర్యంలో ఏకవార మహారుద్రాభిషేకం, లక్ష్మీగణపతి, బాబా దత్తాత్రేయ మూల మంత్ర హోమం, ఆయుష్య హోమం, మహాపూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం గురు చరిత్ర, అఖండ పారాయణ, బాబాహారతి, దత్తాత్రేయస్వామి వారు శత కలశ రుద్రాభిషేకం నిర్వహించారు. బాబావారి ఆలయాన్ని ఎంతో అందంగా తీర్చిదిద్దారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ చైర్మన్ వేదుల అచ్చుత రామారావు ఏర్పాట్లు చేశారు. స్థానిక టూటౌన్ సాయిబాబా ఆలయంలో పూజలు, అభిషేకాలు చేశారు. సాలిపేటలో ఉన్న బాబా వారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్థానిక ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సాయిబాబా ఆలయం, సాంబమూర్తినగర్ సాయి బాబా ఆలయంతో పాటు నగరంలో పలు బాబా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక దేవాలయంవీధిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఆండాళ్‌గోష్టి, శ్రీకృష్ణాష్టకం, లక్ష్మీ అష్టోత్తర నామ స్తోత్రం, విష్ణు సహస్రనామస్తోత్ర పారాయణ నిర్వహించారు.


శాకంబరిగా గంటాలమ్మతల్లి

కరపలో..

కరప: గురుపౌర్ణమి (వ్యాసపౌర్ణిమ) సందర్భంగా మండలంలోని శిరిడీ సాయి మందిరాలు గురువారం భక్తులతో కిటకిటలాడాయి. గురజనాపల్లిలో ఆలయ వ్యవస్థాపకుడు కర్నాసుల శివకుమార్ ఆధ్వర్యంలో, సిరిపురంలో ఆలయ వ్యవస్థాపకులు చిక్కాల దొరబాబు, సుబ్బారావుల ఆధ్వర్యంలో, నడకుదురులో అర్చకుడు సుబ్రహ్మణ్యం ప్రత్యేక పూజలు చేశారు. కరపలో ముత్య ప్రసాద్ దంపతులను వుయ్యూరి రాము తదితరలు సత్కరించి, గురుపూజ నిర్వహించారు. కొంగోడు సాయి మందిరంలో సామూహిక సాయి సత్యవ్రతాలు నిర్వహించారు.

సామూహిక కుంకుమ పూజలు

స్థానిక గ్రామదేవత ఉప్పాలమ్మ ఆలయంలో గురువారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. కరప, పరిసర గ్రామాలనుంచి 120 మంది మహిళలు కుంకుమ పూజలు చేయించుకోగా వేదపండితులు మాచరి సత్యకామేశ్వర పురుషోత్తమశర్మ పూజాదికాలు చేయించారు. గురుపౌర్ణమిని పురస్కరించుకుని వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు వితరణతో అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు.

శాకంబరిగా గంటాలమ్మ

అలాగే గ్రామంలోని పల్లపువీధిలోని గ్రామదేవత గంటాలమ్మ తల్లి గురువారం శాకంబరిగా దర్శనమిచ్చారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు.

గురు బోధలతో మానవ వికాసం

- సద్గురువు సచ్చిదానంద యోగి
- కాకినాడ రూరల్‌లో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు


తిమ్మాపురంలో స్ఫూర్తి ఓం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుపూజోత్సవం

కాకినాడ రూరల్: గురువు బోధనలతో మానవ వికాసం పొందుతారని. ఆయన చూపే మార్గం భవిషత్‌ను నిర్దేశిస్తుందని, ప్రతి ఒక్కరూ తమ గురువులు స్మరించుకోవాలని సద్గురువు సచ్చిదానంద యోగి పేర్కొన్నారు. కాకినాడ రూరల్‌లో గురు పౌర్ణమి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఆలయాలకు భక్తులు పోటెత్తారు. సాయిబాబా, గురు దత్తాత్రేయ ఆలయాలల్లో పూజలు నిర్వహించారు. తిమ్మాపురంలో శ్రీగురు విశ్వ స్ఫూర్తి కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో గురు పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. సైంటిఫిక్ గురువుగా ప్రసిద్ధి చెందిన శ్రీ గురు విశ్వ స్ఫూర్తి చిత్ర పటానికి నివాళులర్పించి, ఆయన బోధనలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డాక్టరు వానపల్లి భాగ్యలక్ష్మి, సదాశివరావు, పాతంశెట్టి సూర్య చంద్ర, అధిక సంఖ్యలో స్ఫూర్తి ఓం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అలాగే స్థానిక రేపూరు సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రమణ్యపేట అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక వేత్త గల్లా సుబ్బారావు, ఉత్తమ ఉపాధ్యాయుడు పరస సత్యనారాయణలను సన్మానించారు.

ఎస్‌బీఐ దాతృత్వం @ రూ.కోటి

- జీజీహెచ్ చంటి పిల్లల విభాగానికి విలువైన వైద్య పరికరాల అందజేత


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ విష్ణువర్ధన్. చిత్రంలో డాక్టర్ లావణ్యకుమారి, డాక్టర్ మాణిక్యాంబ తదితరులు

కాకినాడ క్రైం: జీజీహెచ్‌లోని చంటిపిల్లల విభాగం అధునాతన వైద్య పరికరాలతో నూతన శోభను సంతరించుకుంది. స్థానిక రంగరాయ వైద్య కళాశాలలో పిడియాట్రిక్స్ పీజీ అభ్యసించి అమెరికాతో స్థిరపడిన తెలుగు తేజం డాక్టర్ శశిధర్ చొరవతో మంగుళూరుకు చెందిన చైల్డ్ హెల్త్ గ్రూప్ సౌజన్యంతో ఎస్‌బీఐ ఫౌండేషన్ రూ.కోటి విలువైన వైద్య ఉపకరణాలను చంటి పిల్లల విభాగానికి సమకూర్చింది. ఈ మేరకు జీజీహెచ్‌లోని పీజీ సెమినార్ హాల్లో పిడియాట్రిక్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బుర్రి రాంబాబు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో హెచ్‌వోడీ డాక్టర్ మాణిక్యాంబ అధ్యక్షతన ప్రారంభించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ అత్తలూరి విష్ణువర్ధన్‌లు ఈ యంత్ర పరికరాలను ప్రారంభించారు. డాక్టర్ శశిధర్ చొరవతో ఎస్‌బీఐ ఈ సాయం చేయడం అభినందనీయమని తెలిపారు విష్ణువర్ధన్ తెలిపారు. హెచ్‌వోడీ డాక్టర్ మాణిక్యాంబ మాట్లాడుతూ ఎస్‌బీఐ ఫౌండేషన్ రెండు వెంటిలేటర్లు, థెరాపెటిక్ హైపోథర్మియా యంత్రం, లామినార్ ఎయిర్‌ఫ్లో వర్క్ స్టేషన్, పోనోసైట్ ఎడ్జ్ ఫిలిప్స్ ఎఫిషియా యంత్రాలను సమకూర్చిందన్నారు. సమావేశంలో జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసన్ సహా పీడియాట్రిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ విద్య, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ విజయభాస్కర్, పీడియాట్రిక్స్ పీజీలు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదివితే విజయం తథ్యం

కాకినాడ రూరల్: విద్యార్థులు ఏకాగ్రతతో చదివితే తప్పక విజయం లభిస్తుందని జిల్లా అసిస్టెంట్ కలెక్టరు మనీష్ పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఎస్పీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్‌లో ఆయన పాల్గొని విద్యార్థులకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఏడీ సత్యవతి, హెచ్ఎం గాయత్రి పాల్గొన్నారు. విద్యార్థులతో వారి మాతృమూర్తులకు కాళ్లు కడిగి పాదపూజ చేశారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో అన్ని ప్రభుత్వ పాఠశాల్లో సమావేశాలు నిర్వహించారు.

బంగారం, వెండి సామగ్రి చోరీ

కాకినాడ క్రైం: స్థానికంగా ఓ ఇంట్లో భారీ మొత్తంలో బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు, కాకినాడ ప్రతాప్ నగర్ ట్రెజరీ కాలనీకి చెందిన భూపతి శ్రీదేవి కొన్నాళ్లుగా నాగ్‌పూర్‌లో ఉంటున్నారు. ఇంట్లో ఎవరూ లేరని గుర్తించిన దొంగలు తాళాలు బద్దలుకొట్టి ఇంట్లోకి చొరబడి లాకర్లు ధ్వంసం చేసి 320 గ్రాముల బంగారు ఆభరణాలు, వెండి సామగ్రి, పాటు రూ.15 వేలు నగదు ఎత్తుకెళ్లారు. అదే భవంతిలో పై అంతస్తులో నివసిస్తున్న బంధువులు బాధితురాలికి ఫోన్ చేసి చెప్పారు. ఆమె తరఫున బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్షతగాత్రుడిపై దాడికి యత్నం

ఓ కొట్లాట ఘటనలో గాయాల పాలై కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తిపై అంతకుముందు దాడికి పాల్పడ్డ వ్యక్తి మరోసారి దాడికి యత్నించాడు. గురువారం రాత్రి 10 గంటల సమయంలో జీజీహెచ్ అత్యవసర విభాగంలో చోటు చేసుకున్న ఈ ఘటన ఉద్రిక్తతలకు దారి తీసింది. ఆ సమయంలో ఆసుపత్రి అవుట్‌పోస్ట్‌లో విధుల్లో ఉన్న ఏఎస్ఐ పెట్టా వెంకట రవికృష్ణ గణేష్ చొరవతో ఘర్షణ సర్దుమణిగింది. దాడికి యత్నించిన వ్యక్తిని అదుపులోకి తీసుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.